రబీ వరిపై తెగుళ్ల దాడి

- వాతావరణ మార్పులే కారణం
- నివారణకు వ్యవసాయాధికారి సూచనలు



ఎం.పార్థసారథి

పెరవలి: వాతావరణంలో మార్పుల కారణంగా రబీ వరి పంటకు తెగుళ్లు ఆశించాయి. ఈ తరుణంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తెగుళ్లను నివారించి, అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాఖ తణుకు సహాయ సంచాలకుడు ఎం.పార్థసారథి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఎండ, చల్లదనం వలన పంటకు సుడిదోమ, కాండం తొలిచే, రసం పీల్చే పురుగులు, తుప్పు, మాగుడు తెగుళ్ల వంటివి ఎక్కువగా ఆశిస్తాయని ఆయన వివరించారు. తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు.

మాగుడు లేక పొడతెగులు

గ్రామీణ ప్రాంతాల్లో ఈ తెగులును మాగుడు లేక పొడతెగులు అంటారు. అధిక ఎండలు, గాలిలో తేమ 90 శాతం ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేను చూస్తుండగానే ఎండిపోతుంది.

నివారణ చర్యలు

మాగుడు తెగులు సోకిన వెంటనే రైతులు గుర్తించాలి. దీని నివారణకు ఎకరానికి హెక్సాకొనోజాల్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి. లేదా పిప్రికొనోజాల్ 200 మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ 400 మిల్లీలీటర్ల మందును 2 లీటర్ల నీటికి ఒక మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలి. 15 రోజులకు ఒకసారి రెండు పర్యాయాలు పిచికారీ చేయాలి.

ఎండాకు తెగులు

ఈ తెగులు బాక్టీరియా వల్ల వస్తుంది. దీనివలన ఆకుల అంచులు పసుపు రంగులోకి మారి క్రమేపీ పెరుగుతుంది. అధిక వర్షాలు కురిసినప్పుడు, గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఆశిస్తుంది.

ఏం చేయాలంటే..

కాఫర్ హైడ్రాక్సైడ్ మందును ఎకరాకు 500 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు

పంట చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు ఇది ఆశిస్తుంది. దీనివల్ల పంట ఈనిన తరువాత తెల్లకంకులు ఏర్పడతాయి. దీని నివారణకు ఎకరాకు కొరజోన్ 60 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎర్రనల్లి పురుగు



పెరవలిలో ఎర్రనల్లి ఆశించిన వరిచేను

రసం పీల్చే పురుగుల్లో ప్రమాదకరమైంది ఎర్రనల్లి. ఎండలు అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఇది వర్షాకాలంలో మాన్‌సూన్ బ్రేక్ (వర్షాలు కురవాల్సిన సమయంలో ఏకధాటిగా ఏడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడం) వచ్చినప్పుడు ఈ తెగులు పంటను ఆశిస్తుంది. ఈ తెగులు ఆశించినప్పుడు పంట ఎదుగుదల నిలిచిపోతుంది. ఆకులను ఎర్రనల్లి తినేస్తుంది. పంట ఎర్రబడిపోతుంది. దీనివల్ల కిరణజన్యసంయోగ క్రియ జరగక ఎదుగుదల నిలిచిపోతుంది.

నివారణ చర్యలు

ఎర్రనల్లి పురుగులను నివారించడానికి డైకోఫాల్ ఐదు మిల్లీలీటర్ల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

తుప్ప తెగులు



తుప్ప తెగులు సోకిన చేను

ఈ తెగులు ఆశించిన వరి ఆకులపై గోధుమ రంగులో తుప్పు పట్టినట్టు మచ్చలు ఏర్పడతాయి. ఇవి క్రమేపీ పెద్దవి అవుతాయి. ఆకులో పత్రహరితం లేకుండా పోతుంది. దీంతో దుబ్బు ఎండిపోతుంది. నిర్లక్ష్యం చేస్తే పంట మొత్తం పోతుంది.

నివారించాలిలా..

ఎకరానికి 250 గ్రాముల కార్బండిజమ్ మందు తీసుకుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆ తరువాత వారం రోజులకు కూడా మచ్చలు ఇంకా ఉన్నట్లయితే మరో దఫా ఇదే విధంగా పిచికారీ చేయాలి.

అగ్గితెగులు



అగ్గి తెగులు సోకిన చేను

గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, ఎండిపోయి, తగులబడినట్టు కనిపిస్తాయి. వెన్ను మెడ భాగంలో ఈ తెగులు వ్యాపిస్తుంది. వెన్ను విరిగిపోతుంది. అంతే కాకుండా ఎరువుల్లో నత్రజని ఎక్కువైనప్పుడు కూడా ఈ తెగులు ఆశిస్తుంది.

ఇలా నివారించాలి

ఈ తెగులు ఆశించిన చేల చుట్టూ గట్లపై గడ్డిని నివారించాలి. ట్రైసైక్లోజోల్ ఆరు గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు.

సుడిదోమ



సుడి దోమ ఆశించిన చేను

ఈ దోమ పంట రసం పీల్చివేయడంతో ఆకులు పసుపు రంగులోకి మారిపోతాయి. సుడులుగా ఎండిపోతుంది. దీన్ని త్వరగా అరికట్టపోతే చేను అంతా పాకుతుంది. పంట ఎండిపోతుంది.

అరికట్టాలిలా..

వరిదుబ్బుకు దోమలు 10 నుంచి 15 ఉంటే ఎకరానికి పై మెట్రోజోల్ 120 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకు 25 నుండి 50 దోమలు ఉంటే ఎకరానికి హితోఫిన్ ప్లాక్స్ 300 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకు 50 దోమలు దాటితే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఎకరానికి ఎస్పేట్ 300 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జక్కంపూడి రాజాను కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



జక్కంపూడి రాజాకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న సందీప్, వీరన్న

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను గురువారం రాజమహేంద్రవరం ఆయన క్యాంపు కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని రాజా సూచించారు. ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, వర్రే నాగమురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడదవోలు రూరల్: పట్టణంలో విద్యుత్ వైర్లు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని యర్నగూడెం రోడ్డు ప్రాంతం, విద్యానగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన

దేవరపల్లి: కురుకూరులో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారి ఆలయ ప్రతిష్ఠాపన ఉదయం 7.30 గంటలకు జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామి తిరుకల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం వేదపండితులు యంత్రస్థాపన చేశారు.

క్లుప్తంగా

గంగాధరరావుకు డాక్టరేట్



గంగాధరరావు

నల్లజర్ల: అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గంగాధరరావుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ప్రస్తుతం విజయవాడ లయోలా ఇంజినీరింగ్ విద్యాసంస్థలో ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 'ఆర్థిక చేరిక ద్వారా మహిళా సాధికారిత' అనే అంశంపై పరిశోధనా చేసి ఆంధ్రయూనివర్సిటీ మేనేజ్‌మెంటు విభాగానికి సమర్పించగా, ఈ డాక్టరేట్ లభించినట్టు గంగాధరరావు బుధవారం నల్లజర్లలో విలేకరులకు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి..



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో పింఛను అందిస్తున్న వలంటీర్ బాలు

పెరవలి: కానూరు గ్రామానికి చెందిన సాకుర్తి విశ్వనాథం రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ నెల అతనికి ఇవ్వాల్సిన పింఛనును వలంటీరీ కొమ్మిశెట్టి బాలు గురువారం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి అందించారు. దీంతో విశ్వనాథం కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీత, సర్పంచ్ భావన మధు కానూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కరుటూరి గోపి, కొమ్మిశెట్టి రాము, తోట సురేష్ వలంటీర్‌ను అభినందించారు.

పీహెచ్‌సీ తనిఖీ



సమిశ్రగూడెం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

నిడదవోలు రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీహెచ్‌సీలో అందుతున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన సిబ్బందిని అభినందించారు. రోగులకు అందుతున్న సేవలు, ఇన్‌పేషెంట్ల వివరాలు, ప్రసవాలు, రక్తపరీక్షలు, జాతీయ ఆరోగ్య సేవా కార్యక్రమాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.అమరేంద్ర, ఎంపీహెచ్ఈఓ ఎ.రాజమోహన్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గ్రీన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కౌన్సిలర్, పాఠశాల కరస్పాండెంట్ పువ్వుల రతీదేవి అన్నారు. పట్టణంలోని షైనింగ్ స్టార్స్ ప్లే స్కూల్‌లో గ్రీన్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచడంతో ఆరోగ్యకర పరిసరాలు సాధ్యమవుతాయన్నారు. చిన్నారులు గ్రీన్ డ్రెస్‌లు ధరించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.జ్యోతి, కె.భాను తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

ఉండ్రాజవరం: వెలగదుర్రు ప్రాథమిక పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, అభ్యసనాల స్థాయిపై చర్చించారు. పాఠశాలలో అధునాతన రీతులో నిర్వహించిన నాడు-నేడు పనులు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ అహల్య మహలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మీటి, మహిళా పోలీస్ బి.మేరీ విజయకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా రాక్ చర్చి నూతన మందిరం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కవలగొయ్యి బుచ్చయ్యనగర్‌లో గురువారం రాక్‌చర్చ్ ఆఫ్ ఇండియా నూతన మందిరం ప్రారంభం వైభవంగా జరిగింది. పీఎల్ పరంజ్యోతి కుమారుడు పి.జాన్ లాజరస్ ఆధ్వర్యంలో ఈ చర్చి నిర్మాణం జరిగింది. పరంజ్యోతి పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు సమాజానికి మేలుకొలుపు



పెరవలిలో ర్యాలీ చేస్తున్న వైద్య బృందం



నల్లజర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది



బ్రాహ్మణగూడెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పెరవలి: ఆడపిల్లల చదువు సమాజానికి మేలుకొలుపు లాంటిదని పీహెచ్‌సీ డాక్టర్ ఎ.సత్య కృష్ణవేణి తెలిపారు. మండలంలోని పెరవలి, కాపవరం గ్రామాల్లో వైద్య, విద్యా శాఖాధికారులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'ఆడపిల్లలను రక్షించండి- చదివించండి' అనే నినాదంతో గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసినట్టు తెలిపారు. వైద్య, విద్య శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో...

ఉండ్రాజవరం: ప్రతి ఆడపిల్లను గౌరవిస్తూ, రక్షించుకోవాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యులు రాజానాల ప్రసాద్ అన్నారు. స్థానిక గాయత్రి స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కుమారి, పూజశ్రీ దుర్గ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఏఎస్ఏ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆరోగ్యసిబ్బంది ఈకార్యక్రమం నిర్వహించారు.

లింగ వివక్ష అవగాహన ర్యాలీ

నల్లజర్ల: లింగ వివక్ష నిర్మూలనపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లను రక్షించండి.. చదివించండి అంటూ నినాదాలు చేశారు. నల్లజర్ల ఏకేఆర్జీ కళాశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు సి.రాజుద్దీన్ మాట్లాడుతూ ఆడపిల్ల అమ్మతో సమానమని, అమ్మ లేక సమాజం అనాథగా మారిపోతుందన్నారు. గర్భస్థ పిండలింగ నిర్ధారణ నేరమన్నారు. వెయ్యి మంది మగపిల్లలకు గాను 943 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నారన్నారు. పుట్టేది ఆడ, మగ అని ముందస్తుగానే తెలుసుకొని గర్భంలోనే ఆడపిల్లను తుంచేయడం అన్యాయమన్నారు. ఆవు, గేదె, మేకలలో ఆడపిల్లలు పుడితే సంబరాలు చేసుకునే మనం మనకు ఆడపిల్ల పుడితే ఎందుకు చంపేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీహెచ్ఓ చంద్రశేఖరరాజు, ప్రిన్సిపాల్ ఎస్.వరలక్ష్మి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్ పీపీ మణి, ఏఎస్ఎం జ్యోతి, ఆరోగ్య సహాయకులు జీవివి ప్రసాద్, రామారావు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆశాకిరణాలు

చాగల్లు: బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ బచావో బేటీ పఢావో అనే కార్యక్రమంపై పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల జీవితంలో ఆశాకిరణాలు అని, ఆడపిల్ల రేపటి తల్లి అని ఆమెను చంపవద్దు అని ఎంపీహెచ్‌వో సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. వైద్యసిబ్బంది వి పద్మ, ఎస్.సారమ్మ, ఎం.రాజశేఖర్, డి.వెంకటరామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ పి.రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



తాడిమళ్లలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మానవత సభ్యులు

నిడదవోలు రూరల్: విద్యార్థులంతా ఇష్టంతో కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించగలరని వ్యక్తిత్వ వికాస నిపుణులు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. నిడదవోలు మానవతా మండల శాఖ ఆధ్వర్యంలో తాడిమళ్ల, కాటకోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై గురువారం అవగాహన కల్పించారు. పది పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు భయాందోళన వీడి ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతాశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ గంగాధరం, సభ్యులు బోసు, గాంధీ, కాజా గంగరాజు, రామచంద్రరావు, బలుసు సత్యనారాయణ, కాపకాయల సూర్యనారాయణ, ఉన్నమట్ల లీలాలక్ష్మి, బయ్యే లక్ష్మణరావు, హెచ్ఎం గురుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా డైట్ కళాశాలలో స్నాతకోత్సవం



చాత్రోపాధ్యాయులతో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో గురువారం డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) 2019-21 బ్యాచ్ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా 43 కేటగిరీల్లో టాపర్లుగా నిలిచిన 34 మందికి నగదు బహుమతులు, ముగ్గురికి ఉత్తమ నిర్వహణ నైపుణ్యాల అవార్డులు, ఒకరికి ఉత్తమ సాంకేతిక నైపుణ్య అవార్డును ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అందజేశారు. నగదు బహుమతులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు కొమ్ముల వెంకట సూర్యనారాయణ, కె.గంగాధరరావు, డీఎస్వీ సత్యనారాయణ, డి.సుజాతారత్న, ఎం.జానకీదేవి, ఎస్.ఎస్తేర్, జే.కళావతి, అధ్యాపకేతర సిబ్బంది, వారి తల్లిదండ్రులు పేర్లు మీదుగా టాపర్లకు ప్రదానం చేశారు. సుమారు 60 మంది 2019-21 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బోధనాపరంగా ఇక్కడితో తమతో అనుబంధం తీరిపోయినట్లు భావించవద్దన్నారు. తమ సిబ్బంది సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. అధ్యాపకుడు కొమ్ముల వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ మొదటిసారిగా ఈ తరహాలో ప్రారంభమైన స్నాతకోత్సవాన్ని తర్వాతి బ్యాచ్‌లకూ కొనసాగించాలని భావిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై అవగాహన



నల్లజర్లలో ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్రీనివాస్, రవీంద్రనాథ్

నల్లజర్ల: శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ గురువారం రాత్రి నల్లజర్లలో గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగించారు. మొదటి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణం తీర్చుకునే అవకాశం ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు లభించిందన్నారు. వైఎస్సార్ సీపీకి మీరంతా ఓట్లు వేసి తమ విజయానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీలు మార్గాని భరత్ రామ్, పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఎమ్మెల్యే తలారివెంకట్రావు, అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరావు, గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కేవీకే దుర్గారావు, నరహరశెట్టి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాల పంపిణీ



సరకులు అందజేస్తున్న వెంకట సుబ్రహ్మణ్యం

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తులకు గురువారం మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరకులను ఎంజేఎఫ్ లయన్స్ యనమదల వెంకట సుబ్రహ్మణ్యం సౌజన్యంతో అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కంఠమణి రామకిషోర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పాలెం పాటి చినబాబు, పెనుమాక జయరాజు, గోలి వెంకటరత్నం, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, కె.ప్రత్యూష కుమారి గురువారం నగరంలోని సంక్షేమ హాస్టళ్లను పరిశీలించారు. ఈ మేరకు కేవీ స్టేట్ హోమ్ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలపాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న వారికి మంచి పౌష్టికాహారం అందజేయాలని, విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలలో లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాల సదనం సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించి అక్కడ పిల్లలకు అందుతున్న ఆహారం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా



కొవ్వూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్ ధరలు పెంచిందని సీపీఎం నాయకులు దగ్గ రాధాకృష్ణ, పడాల గంగాధరరావు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం రాకముందు రూ.417 ఉన్న గ్యాస్ సిలెండర్ ధర ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,115 లకు పెరిగిందన్నారు. పేద ప్రజలపై పెనుభారం వేస్తూ అదానీ, అంబానీలకు దేశాన్ని దోచి పెడుతున్నారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం ధరలు తగ్గుతుంటే కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతోందని ఆరోపించారు. ఎం.వీరబాబు, మీరా సాహెబ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుకు సిద్ధం కావాలి



సమావేశంలో ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు

ఉండ్రాజవరం: ఇంటి పన్నుల వసూలకు కార్యచరణ సిద్ధం చేయాలని కార్యదర్శులను ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు ఆదేశించారు. ఉండ్రాజవరం పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీలకు ఇంటి పన్ను డిమాండ్ రూ.2,09,56,000 కాగా నేటికి రూ.1,54,13,000 వసూలయ్యాయని ఆయన తెలిపారు. ఇంకా మండలంలో రూ. 55,43,000 బకాయిలు ఉన్నట్టు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సరాఫరా, వీధి దీపాలు,, పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా జరగాలంటే పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కార్యదర్శులంతా తమ గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు వినియోగించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమర్థంగా పంటకోత ప్రయోగాలు

రాజమహేంద్రవరం రూరల్: పంటకోత ప్రయోగాలను సమర్థంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని రూరల్ మండల వ్యవసాయాధికారి ఎ.బీమరాజు అన్నారు. మండలంలోని తొర్రేడు, కోలమూరు, కాతేరు, ధవళేశ్వరం, రాజవోలు గ్రామాల్లో రబీ సీజన్‌లో 20 పంటకోత ప్రయోగాలకు ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం మండలంలోని వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులకు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ శిబిరం నిర్వహించారు. జాతీయ వ్యవసాయ బీమా పథకంలో భాగంగా ఎంపికైన పంటకోత ప్రయోగాలను గ్రామస్థాయిలో తగిన సమయంలో నిర్వహించాలన్నారు. మండల గణాంకాధికారి పి.రామం, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్ పాల్గొన్నారు.